ముంపు ప్రాంతాలకు వరద తాకిడి

- పెరుగుతున్న గోదావరి
- పేరూరు వద్ద 59 అడుగులకు చేరిన నీటిమట్టం
- లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

మంగపేట:కమలాపురం ఇంటేక్‌వెల్ వద్ద గోదావరి ప్రవాహం

ఏటూరునాగారం : వరదకు అడ్డుగా రైతులు వేసుకున్న ఇసుక బస్తాలు

వాజేడు, సెప్టెంబర్ 10 : ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలతోపాటు మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి పెరుగుతుంది. పూసూరు బ్రిడ్జి వద్ద మంగళవారం పూసూరు, ముల్లకట్ట ఒడ్డులకు ఆనుకొని ఉధృతంగా ప్రవహిస్తున్నది. పేరూరు వద్ద సాయంత్రం ఆరు గంటలకు 17.360 మీటర్లు(59) అడుగులకు నీటిమట్టం చేరుకున్నట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. దీంతో లోతట్టు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. టేకులగూడెం జాతీయ రహదారిపైకి సోమవారం సాయంత్రం వరదనీరు చేరి నీటమునిగింది. దీంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. వరద ముంపు ప్రదేశాలను సందర్శించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వాజేడు గ్రామశివారులోని చర్చితో పాటు పక్కన ఉన్న చిన్న గుడిసెలు నీట మునిగాయి. అప్రమత్తమైన పంచాయతీ అధికారులు గుమ్మడిదొడ్డి, వాజేడు వెళ్లే ప్రధాన రహదారి బ్రిడ్జిపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. చంద్రుపట్ల, పేరూరు వెళ్లే మర్రిమాగువాగు బ్రిడ్జిపైకి వరద ప్రవహం చేరింది. కొంగాల వాగు వద్ద రహదారిపైకి నీరు చేరడంతో వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

లీకేజీకి ఇసుక బస్తాలతో అడ్డుకట్ట

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ఓడవాడ కరకట్టకు గోదావరి వరద తాకి ప్రవహిస్తున్నది. దీంతో తూము షట్టర్ల నుంచి లీకేజీ వాటర్ లోనికి వస్తుంది. కట్టకు లోపలివైపున వేసిన రెండు ఎకరాల వరి పంటలోకి వరద చేరింది. మిర్చి నారు కూడా మునకపట్టడంతోపాటు లోతట్టు ఇళ్లలోకి వరద చేరే అవకాశం ఉంది. లీకేజీ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడతో లీకేజీ వద్ద స్థానికులతో కలిసి ఇసుక బస్తాలు వేశామని బాధిత రైతు వల్స మొండయ్య తెలిపారు.

గోదావరి లంకకు నిలిచిన రాకపోకలు..

వెంకటాపురం(నూగూరు) : మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతూ ప్రమాద స్థాయిని మించి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీనికితోడు మండలంలో క్రమక్రమంగా గోదావరి వరద పెరుగుతుంది. మంగపేట రోడ్డులోని గోదావరి పాయకు గోదావరి వరద చేరడంతో గోదావరి లంక ల్లోకి రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో కంకలవాగు, పాత్రాపురం, వాగు, జిన్నెలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లోతట్టు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బోదాపురం గ్రామ సమీపంలోని జిన్నెల వాగుపై గోదావరి వరద నీరు చేరడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి, మండలకేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలకు సూరవీడు సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడగా అధికారులు చెట్టును తొలగించారు.

వరద ముంపు ప్రాంతాల పరిశీలన

గోదావరి వరద ముంపు ప్రాంతాలను మంగళవారం తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య పరిశీలించారు. బోదాపురం, కుక్కలతోగు, బల్లకట్టు వాగుల వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. ఈ మేరకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. బోదాపురం వద్ద రోడ్డుపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వెళ్లే ప్రయాణికులు ఏటూరునాగారం మీదుగా వెళ్లే విధంగా చర్యలను చేపట్టారు.

ఇంటేక్ వెల్ వద్ద 82మీటర్ల ఎత్తులో ప్రవాహం

మంగపేట : కమలాపురం బిల్టు ఫ్యాక్టరీకి చెందిన ఇంటేక్ వెల్ వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చి రెండు తీరాలను ఆనుకొని ప్రవహిస్తున్నది. ఇంటేక్ వెల్ వద్ద మంగళవారం సాయంత్రానికి గోదావరి సముద్ర మట్టానికి 82 మీటర్ల ఎత్తులో ప్రవాహిస్తుంది. పుష్కరఘాట్‌కు ఎగువ నుంచి నదీ తీరం కోతకు గురవుతున్నది. దీంతో తీర ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. జాలర్లను చేపల వేటకు నిలిపివేశారు. మండల కేంద్రంలోని పొదుమూరు, ముస్లీం వీధి, సినిమా హాల్ నివాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన ఏఎస్పీ

ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్, ఏటూరునాగారంలోని ఓడవాడ వరద ప్రాంతాన్ని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ మంగళవారం పరిశీలించారు. పెరుగుతున్న గోదావరి వరద వివరాలు తెలుసుకున్నారు. చేపట్టిన చర్యలపై నీటి పారుదలశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ పాల్గొన్నారు.

కాగా, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి తదితరులు తరచూ వరద ప్రాంతాన్ని పరిశీలిస్తూ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు. కాగా, గోదావరి వరద పెరగడంతో మంగళవారం సాయంత్రాని కి రామన్నగూడెం-రాంనగర్ మధ్యలోని జీడివాగులోకి చేరింది. దీంతో ఈ రెండు గ్రామాల మధ్యలో ఉన్న రోడ్డుపై వరద చేరింది. దీంతో రవాణా సౌకర్యం నిలిచిపోయింది. ఇరువైపులా వాహనాలు వెళ్లకుండా ట్రాక్టర్లను అడ్డుగా పెట్టారు.

మార్కెట్ యార్డు స్థలాన్ని పరిరక్షించాలి

సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

మార్కెట్ యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కాటారం, సెప్టెంబర్ 10 : వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలం అక్రమణకు గురికాకుండా పరిరక్షించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఏఎంసీ స్థలాన్ని సందర్శించారు. ఇటీవల సర్వే ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అధికారులు ఏఎంసీ స్థలాన్ని సర్వే చేసి కొంత భూమి కబ్జాకు గురైనట్లు గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఏఎంసీకి ఉండాల్సిన 12.9 ఎకరాల భూమిని పరిరక్షించడానికి కబ్జాకు గురైన స్థలాలను వెంటనే స్వాధీనం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. స్థలం అన్యాక్రాంతమవుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఏఎంసీ కార్యదర్శి షరీఫ్, ఆర్ఐ వెంకన్న, ఏఎంసీ సిబ్బంది, రైతులు ఉన్నారు. అలాగే సబ్‌కలెక్టర్‌ను స్థానిక కార్యాలయంలో బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

వరద బాధితులను ఆదుకోవాలి

బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి

ఇల్లు కూలిపోయిన బాధితుడికి ఆర్థిక సాయమందిస్తున్న నాగజ్యోతి

తాడ్వాయి, సెప్టెంబర్ 10 : ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిన, దెబ్బతిన్న ఇళ్ల బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్మన్ బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. మండలంలోని కాటాపురంలో బాధితులను మంగళవారం పరామర్శించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా షేక్ అక్బర్ పెంకుటిళ్లు పూర్తిగా నేలమట్టం కాగా బాధితుడిని కలిసి ఆర్థిక సాయం అందించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ వర్షాలు కురిసి ఇన్ని రోజులు అయినప్పటికీ నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. వెంటనే బాధితులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన గుండు సీతమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట నాయకులు లాలయ్య, రమేశ్, శ్రీనివాసరెడ్డి, భిక్షపతి, సత్యనారాయణ, సురేశ్, లక్ష్మీనర్సయ్య, రామారావు, సావిత్రి, సారయ్య, తిరుపతి, సమ్మయ్య, వెంకటేశ్, కృష్ణ, సమ్మయ్య, విజయ, శ్రీలక్ష్మి, మానస, దేవి, లక్ష్మి పాల్గొన్నారు.

గోనెపల్లిలో రైతుల నిరసన

పంటల నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్

తాడ్వాయి, సెప్టెంబర్10 : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ మండలంలోని గోనెపల్లికి చెందిన రైతులు మంగళవారం గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వరదల తాకిడికి వందల ఎకరాల పంటలు కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయామన్నారు. పంటలు సర్వే చేసేందుకు ఒక్క అధికారి కూడా గ్రామానికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లు కూలిపోయి నిరాశ్రయులుగా మారారని, పాడి సంపద కూ డా తీవ్రంగా నష్టపోయామన్నారు. రైతులకు తక్షణ సహాయం అందించాలన్నారు. రైతులు ఎల్లబోయిన ముతేశ్, పూ ణెం సుదర్శన్, చింత బాలయ్య, అర్రెం రాజు, ఈసం సుశీల తెలిపారు.

వరద బాధితులకు చేయూత

కాటారం, సెప్టెంబర్ 10 : కాటారం వస్త్ర వ్యాపారుల సంఘం సభ్యులు ఔదార్యం చాటుకున్నారు. ఖమ్మం వరద బాధితులకు రూ.లక్ష విలువైన దుస్తులను పంపించారు. ఈ మేరకు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతికి వారు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొల్లం రాజబాబు, ఉపాధ్యక్షుడు పులి అశోక్, ప్రధాన కార్యదర్శి దోమల సురేశ్, సంయుక్త కార్యదర్శి జిల్లెల్ల శ్రీశైలం, కోశాధికారి బచ్చు ప్రకాశ్, కార్యవర్గ సభ్యులు గుల్లపల్లి శ్రీరామ్, గంట సుధాకర్ పాల్గొన్నారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

రేగొండ, సెప్టెంబర్ 10 : పత్తిసాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వరంగల్ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త దిలీప్‌కుమార్ అన్నారు. మంగళవారం ఏవో వాసుదేవారెడ్డి ఆధ్వర్యంలో రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లో శాస్త్రవేత్తల బృందం దిలీప్‌కుమార్, నాగభూషణం, మధు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలతో జాలువారి మొక్కలు ఎర్రబడి చనిపోతాయన్నారు. చేలల్లో నీరు నిల్వ ఉంచకుండా కాలువలు తీయాలన్నారు. పైపాటుగా ఎకరానికి 20కిలోల యూరియా, 15కిలలో పొటాష్, కాయులు, పూత రాలకూండా 10 గ్రాముల 13-0-45మందు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. డీఏవో విజయ్‌భాస్కర్, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సంజీవరావు ఉన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించాలి

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 10 : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 20న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నారాయణబాబు పోలీసు, ఎక్సైజ్, రవాణాశాఖ అధికారులకు సూచించారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న సమస్యలను పెద్దవిగా చేసుకొని కేసుల్లో ఇరికి పోలీస్ స్టేషన్లు, కోర్టులకు ఎక్కితే నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే జయరాంరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ రామచంద్రా రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల పాల్గొన్నారు.

గోవిందరావుపేటలో పంట నష్టంపై సర్వే

గోవిందరావుపేట, సెప్టెంబర్ 10 : ఇటీవల కురిసిన భారీవర్షాలతో మండలంలో జరిగిన పంట నష్టంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. దయ్యాలవాగు, గుండ్లవాగు ప్రాజెక్టు ఇరువైపుల వరద ఉధృతితో భారీగా వరి పంట నీటమునిగింది. దీంతో వందలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారి జితేందర్, ఏఈవోలు గోపాల్‌రెడ్డి, దాదాసింగ్, ఫయాజ్‌ల ఆధ్వర్యంలో పంట నష్టంపై సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

'బొగ్గు తవ్వే హక్కు సింగరేణికే ఉండాలి'

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 10 : బొగ్గు తవ్వే హక్కు సింగరేణికి మాత్రమే ఉండాలని సీపీఎం భూపాలపల్లి మండల కార్యదర్శి వెలిశెట్టి రాజయ్య అన్నారు. రాష్ట్రంలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వారు సింగరేణి పరిరక్షణ బొగ్గు బ్లాక్‌ల సాధన పోరాటం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో సింగరేణి బొగ్గు బ్లాకులు క్రమంగా మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. బొగ్గు బ్లాకులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేలా అనుకూలమైన వేలంపాట విధానాన్ని తీసుకొచ్చి సింగరేణి సంస్థ కూడా వేలంలో పాల్గొనవచ్చని తప్పుడు సంకేతాలు జారీ చేసిందన్నారు. కుట్రలో భాగంగా బొగ్గు బావులు ప్రైవేట్ పరం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ చిన్న రజాక్, గడప శేఖర్, బక్కమ్మ, గీత, సుస్మిత పాల్గొన్నారు.

వినాయకుడికి 108రకాల నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

లక్ష్మీనగర్ వినాయకుడికి 108 రకాల నైవేద్యాలు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 10 : భూపాలపల్లి పట్టణంలోని లక్ష్మీ నగర్‌లో బాల వినాయక కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడికి 108 రకాల పిండి వంటలు, స్వీట్లను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. సుభాష్‌కాలనీ రామాలయంలో ఏర్పాటు చేసిన గణపతికి 101 కేజీల లడ్డును భాస్కరి జ్యోతి-సుధాకర్ పటేల్ సమర్పించగా మంగళవారం భక్తులు లడ్డుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండ శంకర్, గుమ్మడి వెంకటయ్య, బేతు సమ్మయ్య, వెంకటరెడ్డి, రమేశ్, లక్ష్మారెడ్డి, సంపత్, రాజు, రవీందర్ పాల్గొన్నారు.

శాశ్వత అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలి

కలెక్టర్ టీఎస్ దివాకర

మేడారం పూజారులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ములుగురూరల్, సెప్టెంబర్ 10 : మేడారం జాతర శాశ్వత అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సునితతో కలిసి అధికారులు, పూజారులతో సమీక్ష నిర్వహించారు. జాతర అభివృద్ధికి సంబంధించిన పనుల ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేయాలన్నారు. క్యూలైన్‌లలో తాగునీటి సౌకర్యం, నీడను ఇచ్చే సౌకర్యాలను కల్పించాలని అన్నారు. గద్దెల ప్రాంగణంలో నీరు నిలువకుండా పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అన్నారు. సెలవు దినాలలో మేడారానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. అనంతరం పూజారులు కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్‌ను శాలువాలతో సత్కరించి అమ్మవార్ల ప్రసాదమైన బెల్లాన్ని అందజేశారు. సమావేశంలో ఈవో రాజేందర్, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎమ్మెల్యే జీఎస్ఆర్

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 10 : జిల్లాలోని ఎస్సీ, బీసీ, గిరిజన, మైనార్టీ, కేజీబీవీ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. వసతి గృహాల్లో సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. కోతుల బెడద ఎక్కువగా ఉన్నదని, అవి రాకుండా మెష్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని వసతి గృహాల్లో సోలార్ ప్లాంట్, ఆర్‌వో మంచినీటి ప్లాంట్ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సిబ్బంది అవసరం ఉందని, ఖాళీలు భర్తీకి లిఖితపూర్వకంగా నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి అదనపు మరుగుదొడ్లు, తరగతి గదులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, ప్రాధాన్యత పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక ఉప కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలని తెలిపారు. క్రమపద్ధతిలో పనులు పూర్తి చేయాలని, విద్యార్థుల సమస్యల పరిశీలనకు వసతి గృహాల్లో రాత్రి బస చేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు సునీత, శైలజ, పంచాయతీరాజ్ ఈఈ దిలీప్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమానికి పాటు పడాలి'

ములుగురూరల్, సెప్టెంబర్10 : ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ఎన్‌హెచ్ఆర్సీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులకు మంగళవారం ములుగులో ఎన్‌హెచ్ఆర్సీ జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించగా మొగుళ్ల భద్రయ్య హాజరై సన్మానించారు. అనంతరం భద్రయ్య మాట్లాడారు. ఎంఈఓ శ్రీనివాసులు, ప్రైవేట్ ఉపాధ్యాయులు సముద్రాల మధుసూదనాచారి, భూక్యా సమ్మయ్య, లావుడ్యా రాజు, గొట్టె రమేశ్, ముప్పు పూర్ణిందర్, గడ్డం సారంగపాణి, మడూరి శ్రీనివాస్, దొంతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఇమ్రాన్‌ఖాద్రీ, బల్గూరి జనార్దన్, ఎన్‌హెచ్ఆర్సీ నాయకులు సంజీవ, రవి, గణేశ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

గోవిందరావుపేట, సెప్టెంబర్ 10 : మండలంలోని పస్రా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణ, బాల్య వివాహాల నివారణపై హెచ్ఎం అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ హాజరై మాట్లాడారు. మాదవద్రవ్యాల వినియోగంతోపాటు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ జ్యోతి, సుదర్శన్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

ములుగురూరల్, సెప్టెంబర్ 10 : భారత రిజర్వు బ్యాంకు నిర్వహించే జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం అన్నారు. మంగళవారం కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి క్విజ్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. రిజర్వు బ్యాంకు ఏర్పడి 90యేళ్లు పూర్తయిన సందర్భంగా డిగ్రీ చదివే విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10లక్షలు, 2వ బహుమతిగా రూ.8లక్షలు, 3వ బహుమతిగా రూ.6లక్షలు ప్రకటించారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు సెప్టెంబర్ 17వ తేదీ లోపు www.rbi90 quiz.in అనే వెబ్ సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

భవనాల తక్షణ మరమ్మతులకు ఆదేశాలు

జీసీసీ కార్యాలయం, డిగ్రీ కళాశాలను తనిఖీ చేసిన పీవో చిత్రామిశ్రా

జీసీసీ భవనాన్ని పరిశీలిస్తున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, సెప్టెంబర్ 10 : గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, జీసీసీ డివిజనల్ కార్యాలయం, సేల్స్‌డిపోల మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల, జీసీ సీ డివిజన్ కార్యాలయాన్ని పీవో సందర్శించారు. చిన్నబోయినపల్లి, మేడారంలోని సేల్స్ డిపోలను కూడా పరిశీలించా రు. డిగ్రీ కళాశాలలో ఫ్లోరింగ్, రూఫ్ లీకే జీ, పొదల తొలగింపు, డైనింగ్ హాల్ మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని ఈఈ వీరభద్రంను ఆదేశించారు. జీసీసీ డివిజన్ కార్యాలయంతో రెండు సేల్స్‌డిపోల్లో అత్యవసర మరమ్మతులకు ఆదేశా లు జారీ చేశారు. రికార్డులను క్రమబద్ధీకరించుకోవాలని డీఎం ప్రతాప్‌రెడ్డికి సూ చించారు. కార్యక్రమంలో ఎస్‌వో రాజ్‌కుమార్, ఈఈ వీరభద్రం, ఎస్‌వో రాజ్‌కుమార్, ఆర్‌సీ వో హరిసింగ్, ఏటీడీవో దేశీరాం, మేనేజ ర్ దేవ్, డీఈఈ ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి జిల్లాలో 18.7 మి.మీ వర్షపాతం

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 10 : జిల్లాలో మంగళవారం ఉదయం 8:30 గంటల వరకు 18.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మహాముత్తారం మండలంలో 14.2 మి.మీ, మహదేవపూర్ 22.4, కాటారం 37.4, మల్హార్‌రావు 18, టేకుమట్ల 13, మొగుళ్లపల్లి 10.2, చిట్యాల 13.6, రేగొండ 12.4, పలిమెల 42.6, భూపాలపల్లి 14.2, గణపురం మండలంలో 8.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

కాటారం మండలంలో భారీ వర్షం

కాటారం, సెప్టెంబర్ 10 : మండలంలో మంగళవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. సుమారు 4సెంటీ మీ వర్ష పాతం నమోదు కావడంతో పల్లపు ప్రాంతాల్లో ఉన్న ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది. గోపాల్‌పూర్, బొర్రవాగు, బండలవాగులు పొంగి పత్తి చేలు, వరిపొలాలు వరదనీటిలో మునిగి నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలతో పత్తి చేలు ఎర్రబారాయి.

రాకపోకలకు అంతరాయం..

పలిమెల : మండలంలోని ముకునూరు గ్రామ శివారు తోగు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మంగళవారం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో భూపాలపల్లి నుంచి వయా మహదేవపూర్, పలిమెల, ముకునూరు, లక్ష్మీపూర్, కన్నాయిగూడెం, ఏటూరునాగారం గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. అధికాలు తోగు వాగును పరిశీలించి ప్రమాదాలు జరగకుండా రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రకాశ్‌రెడ్డి సూచించారు.

పులి సంచారం లేదు : ఎఫ్ఆర్‌వో

ఏటూరునాగారం, సెప్టెంబర్ 10 : ఏటూరునాగారం-కమలాపురం మధ్యలోని జీడివాగు ప్రాంతంలో సోమవారం రాత్రి పులి సంచరించినట్లు వచ్చిన ప్రచారం నేపథ్యంలో ఆ పరిసరాల్లో విచారణ చేశామని ఎఫ్ఆర్‌వో అబ్దుల్ రెహమాన్ తెలిపారు. అక్కడ ఎలాంటి ఆనవాళ్లు లభించలేదన్నారు. అధికారులు పులిసంచారంపై నిర్ధారణ చేయడంతో ఈ ప్రాంత ప్రజలు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 10 : భూపాలపల్లి మండలంలోని పనిచేస్తున్న ఇద్దరు బీఎల్‌వోలకు తహసీల్దార్ శ్రీనివాస్ మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆగస్టు 20న హౌస్ హోల్డర్ వెరిఫికేషన్ కొనసాగుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న రేగుకుంట్ల ప్రశాంత్, పంబాపూర్ కారోబార్ సుదర్శన్ ఆదివారం వాట్సాప్ గ్రూప్‌లో బీఎల్‌వోలకు జనవరి నుంచి రావాల్సిన వేతనం వచ్చే వరకు సర్వే నిలిపివేసి ధర్నాలు, నిరసనలు చేయాలని ఇతర బీఎల్‌వోలను రెచ్చగొడుతూ పోస్టులు చేశారన్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న తహసీల్దార్ మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఎరువుల దుకాణాల్లో ఏడీఏ తనిఖీలు

కాటారం, సెప్టెంబర్ 10 : మండలంలోని పలు ఎరువుల దుకాణాలు, డీసీఎంఎస్ సెంటర్లను వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు శ్రీపాల్ మంగళవారం తనిఖీ చేశారు. ఏవో పూర్ణిమతో కల